

ఉన్నత విద్యాసంస్థలను భారీగా స్థాపించాం

న్యూఢిల్లీ: దేశంలో 2014 నుంచి పెద్ద ఎత్తున ఉన్నత విద్యాసంస్థలను స్థాపించామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. 7 ఐఐటీలు, 16 ఐఐఐటీలు, 7ఐఐఎమ్ లు, 15 ఎయిమ్స్, 390 యూనివర్సిటీలను, 3000 ఐటీఐలను ఏర్పాటు చేశామని మంత్రి చెప్పారు. "పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎమ్ శ్రీ) నాణ్యమైన బోధనను అందిస్తోంది. స్కిల్ ఇండియా మిషన్ 1.4 కోట్ల మంది యువతకు శిక్షణనిచ్చింది. 54 లక్షల యువత నైపుణ్యాలను మెరుగుపర్చింది" అని నిర్మల పేర్కొన్నారు.

ఇస్రోకు బూస్ట్

బడ్జెట్ లో స్పేస్ డిపార్ట్ మెంట్ కు కేంద్రం ఈసారి రూ.13,042.75 కోట్లు కేటాయించింది. ఇది పోయినేడాదితో పోలిస్తే రూ.498.84 కోట్లు ఎక్కువ. ఇక సైన్స్ అండ్ టెక్నాలజీ మినిస్ట్రీకి రూ.16,603.94 కోట్లు కేటాయించారు. ఇది పోయినేడాదితో పోలిస్తే రూ.242 కోట్లు ఎక్కువ. ఈ మంత్రిత్వ శాఖ కింద మూడు ముఖ్యమైన శాఖలు ఉన్నాయి. వాటిలో సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్ మెంట్ కు రూ.8029.01 కోట్లు, బయోటెక్నాలజీ డిపార్ట్ మెంట్ కు రూ.2,251.52, సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ డిపార్ట్ మెంట్ కు రూ.6,323.41 కోట్లు కేటాయించారు.

ఎలక్ట్రికల్‌వాహనాల వాడుకను పెంచుతాం

దేశంలో ఎలక్ట్రికల్‌వాహనాల వినియోగాన్ని పెంచుతామని నిర్మల అన్నారు. ఇందుకోసం ప్రభుత్వం పరంగా ఈ రంగానికి వివిధ రకాల సౌకర్యాలను కల్పిస్తామన్నారు. అలాగే, ప్రజారవాణాలోకి ఎలక్ట్రిక్ వాహనాలు, బస్సులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అయితే, సబ్సిడీ ప్రోగ్రాం పొడిగింపుపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మార్చి 2024 నాటికి ఫేమ్II సబ్సిడీ ప్రోగ్రాం గడువు ముగియంది. దీని పొడిగింపుపై నిర్మల ఎలాంటి ప్రకటన చేయలేదు.



ఐదేండ్లలో 2 కోట్ల ఇండ్లు కట్టిస్తం




- ఇప్పటికే 3 కోట్ల ఇండ్లు నిర్మించినం: నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: పేదోడి సొంతింటి కల నెరవేర్చేందుకు రానున్న ఐదేండ్లలో గ్రామీణ నిరుపేదలకు 2 కోట్ల ఇండ్లు కట్టిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పీఎం ఆవాస్ యోజన (గ్రామీణ్) కింద అర్హులైన వారందరికీ ఇండ్లు నిర్మిస్తామని ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. సొంతింటి నిర్మాణం కోసం తీసుకొచ్చిన 'పీఎం ఆవాస్ యోజన గ్రామీణ్' కరోనా కాలంలోనూ కొనసాగిందని ఆమె చెప్పారు. 3 కోట్ల ఇండ్ల నిర్మాణం లక్ష్యాన్ని త్వరలో చేరుకోనున్నామని తెలిపారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని రాబోయే ఐదేండ్లూ ఈ పథకాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. మొత్తం 2 కోట్ల ఇండ్లను నిర్మించనున్నట్లు వివరించారు. గడిచిన పదేండ్లలో మోదీ ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ ఇల్లు, నీరు, విద్యుత్ అందించడానికి కృషి చేసిందన్నారు. వంట గ్యాస్, బ్యాంక్ ఖాతా తెరిపించామని వివరించారు. 'అందరికీ హౌసింగ్ మిషన్' కింద.. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్), ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (రూరల్ లేదా గ్రామీణ) పథకాలు ఉన్నాయన్నారు. మధ్య తరగతి ప్రజల కోసం కొత్త గృహ నిర్మాణ పథకంపై, అర్హులైన మధ్య తరగతి ప్రజలు సొంతంగా ఇల్లు కొనేందుకు లేదా కట్టుకునేందుకు గృహనిర్మాణ పథకాన్ని ప్రారంభిస్తామని నిర్మల వెల్లడించారు. పీఎం ఆవాస్ యోజన పథకానికి కేంద్ర బడ్జెట్ 2023లో రూ.79,000 కోట్లు కేటాయించింది. ఇది అంతకు ముందు ప్రవేశపెట్టిన బడ్జెట్ కంటే 66 శాతం ఎక్కువ. ఇందులో పీఎంఏవై అర్బన్‌కు రూ.25,103 కోట్లు కేటాయించారు. మిగిలిన మొత్తం పీఎంఏవై రూరల్ పథకానికి కేటాయించారు.

కోటి కుటుంబాలకు 300 యూనిట్ల కరెంట్ ఫ్రీ

- రూఫ్ టాప్ సోలార్ స్కీంకు రూ.10 వేల కోట్లు
- ప్రధానమంత్రి సూర్యోదయ యోజనతో
- ఏడాదికి రూ.18 వేలు ఆదా: నిర్మల

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి సూర్యోదయ యోజన కింద రూఫ్ టాప్ సోలార్ స్కీంకు మధ్యంతర బడ్జెట్ లో రూ.10 వేల కోట్లు కేటాయించారు. ఈ పథకం కింద రూఫ్ టాప్ సోలారైజేషన్ (ఇంటి మిద్దెపై సోలార్ రూఫ్ టాప్ లు అమర్చడం) తో ప్రతి నెలా కోటి కుటుంబాలకు 300 యూనిట్ల కరెంట్ ఫ్రీగా సప్లై చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దీంతో ఏడాదికి ఆ కుటుంబాలకు రూ.15 వేల నుంచి రూ.18 వేల చొప్పున ఆదా అవుతుందని, అంతేకాకుండా మిగులు విద్యుత్తును డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకు అమ్ముకోవచ్చని నిర్మల తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. స్వయం ఉపాధి పొందాలనుకునే యువతకు సూర్యోదయ యోజన పథకంతో ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. రూఫ్ టాప్ ల తయారీ, ఇన్ స్టలేషన్, మెయింటెనెన్స్ వంటి వాటితో నైపుణ్యం గల యువత ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఆమె పేర్కొన్నారు. 2070 లోపు కర్బన ఉద్గారాలను సున్నాకు తగ్గించాలన్న విషయంలో కట్టుబడి ఉన్నామని, అందుకోసం సోలార్, విండ్ ఎనర్జీ వంటి ప్రత్యామ్నాయాలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ డేటా ప్రకారం 73 గిగావాట్లపైనే సోలార్ ఎనర్జీని ఉత్పత్తి చేసే సామర్థ్యం దేశానికి ఉందన్నారు. "విండ్ ఎనర్జీతో 45 గిగావాట్లు, హైడ్రో ఎనర్జీతో 25 మెగావాట్ల కరెంట్ ఉత్పత్తి చేశాం. అలాగే బయోమాస్ తో 10 గిగావాట్లు, స్మాల్ హైడ్రోతో 25 మెగావాట్లు, వేస్ట్ టు వేస్టు ఎనర్జీతో 583 మెగావాట్ల కరెంట్ జనరేట్ చేశాం. 2030 లోపు 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నాం" అని నిర్మల పేర్కొన్నారు.



లోక్‌పాల్‌కు 33, సీవీసీకి 51 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగుల మీద వచ్చిన అవినీతి ఆరోపణలపై దర్యాప్తు చేసే అత్యున్నత సంస్థ అయిన లోక్‌పాల్‌కు రూ.33.32 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. పోయినేడాది లోక్‌పాల్‌కు మొదటిసారిగా రూ.92 కోట్లు కేటాయించి, ఆపై 110 కోట్లకు సవరించారు. ఈ సారి మధ్యంతర బడ్జెట్ లో మాత్రం కోత పెట్టారు. ఈ మొత్తాన్ని లోక్‌పాల్ ఏర్పాటు, తదితర ఖర్చుల కోసం వినియోగించనున్నారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ)కు మధ్యంతర బడ్జెట్‌లో రూ.51.31 కోట్లు కేటాయించారు.



మాల్దీవులకు సాయంలో 170 కోట్లు కోత

న్యూఢిల్లీ: మధ్యంతర బడ్జెట్‌లో విదేశాంగ శాఖకు రూ. 22,154 కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఇతర దేశాలకు మనదేశం అందించే ఆర్థిక, అభివృద్ధి సాయం కింద అత్యధికంగా భూటాన్‌కు రూ.2,068 కోట్లు అందించాలని నిర్ణయించారు. కనెక్టివిటీ ప్రాజెక్టుల్లో భాగంగా చాబహార్ పోర్టు కోసం రూ.100 కోట్లు కేటాయించారు. ఈసారి మాల్దీవులకు బడ్జెట్ రూ.600 కోట్లకు తగ్గించారు. అఫ్గానిస్తాన్‌తో ఇప్పటికే ఉన్న ప్రత్యేక సంబంధాలకు కొనసాగింపుగా, ఆ దేశం కోసం రూ.200 కోట్ల బడ్జెట్ సాయాన్ని కేటాయించారు. అభివృద్ధి సాయం కింద బంగ్లాదేశ్‌కు రూ.120 కోట్లు, శ్రీలంకకు, రూ.75 కోట్లు, మయన్మార్‌కు రూ.250 కోట్లు, మారిషస్‌కు రూ.370 కోట్లు, నేపాల్‌కు రూ.700 కోట్లు అందించనున్నారు. ఆఫ్రికా దేశాలకు ప్రత్యేకంగా రూ.200 కోట్లు కేటాయించారు.

కేంద్ర మంత్రుల జీతభత్యాలకు రూ.1249 కోట్లు

న్యూఢిల్లీ : కేంద్ర మంత్రులు, క్యాబినెట్ సెక్రటేరియట్, ప్రధానమంత్రి కార్యాలయం, దేశంలో పర్యటించే అతిథుల ఆతిథ్యం కోసం బడ్జెట్ లో రూ.1248.91 కోట్లు కేటాయించారు. 2023-24లో వీరందరికి రూ.1803.01 కోట్లు కేటాయించగా ఈసారి రూ.1248.91 కోట్లు అలొకేట్ చేశారు. కేంద్ర మంత్రిమండలి సభ్యుల ఖర్చులకు రూ.832.81 కోట్లు కేటాయించారు. అందులో మంత్రుల జీతభత్యాలు, ప్రయాణ ఖర్చులు, ఇతర భత్యాలు ఉన్నాయి. నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ కు రూ.200 కోట్లు కేటాయించారు. అలాగే ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ (పీఎస్ఏ) ఆఫీసుకు రూ.76.20 కోట్లు అలొకేట్ చేశారు. క్యాబినెట్ సెక్రటేరియట్ కు రూ.70 కోట్లు కేటాయించారు. ప్రధాన మంత్రి కార్యాలయానికి రూ.65.30 కోట్లు కేటాయించారు. దేశంలో పర్యటించే విదేశీ అతిథులు, నేషనల్ డే రోజున రాష్ట్రపతి భవన్ లో ఏర్పాటు చేసే కార్యక్రమాలకు రూ.4 కోట్లు, మాజీ గవర్నర్ల సహాయకుల కోసం రూ.1.80 కేటాయించారు.



ఎవుసానికి అంతంతే..

మిగతా రంగాలతో పోలిస్తే నామమాత్రపు పెంపుతో సరి
మొత్తం రూ. 1.27 లక్షల కోట్లు కేటాయింపు
గత బడ్జెట్ కన్నా రూ. 2 వేల కోట్లు మాత్రమే పెరుగుదల

న్యూఢిల్లీ:

మధ్యంతర బడ్జెట్ లో మిగతా రంగాలతో పోలిస్తే వ్యవసాయ రంగానికి కేటాయింపులు నామమాత్రంగానే పెరిగాయి. అలాగే ఇతర ప్రధాన రంగాలతో పోలిస్తే వ్యవసాయ రంగానికే అత్యంత తక్కువగా నిధులు అలకేట్ అయ్యాయి. ఎవుసానికి గత బడ్జెట్‌తో పోలిస్తే ఈ సారి రూ. 2 వేల కోట్లు మాత్రమే ఎక్కువగా కేటాయించారు. మధ్యంతర బడ్జెట్ 2024=25లో వ్యవసాయ రంగానికి మొత్తం రూ. 1,27,469 కోట్లను ఆర్థిక మంత్రి నిర్మల అలకేట్ చేశారు. 2023=24 బడ్జెట్ లో అగ్రికల్చర్ సెక్టార్‌కు రూ. 1.25 లక్షల కోట్లను కేటాయించగా, ఈ సారి అలకేషన్స్ రూ. 2 వేల కోట్లే పెంచారు. ఇందులో పీఎం కిసాన్ స్కీంకు రూ. 60 వేల కోట్లు అలకేట్ చేశారు. దేశవ్యాప్తంగా 11.8 కోట్ల మంది చిన్న, సన్నకారు రైతులకు పీఎం కిసాన్ యోజన కింద పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. పీఎం ఫసల్ బీమా యోజన కింద 4 కోట్ల మంది రైతులకు పంటల బీమా అందించామన్నారు. పీఎం కిసాన్ సంపద యోజన కింద 38 లక్షల రైతులు లబ్ధి పొందారని, 10 లక్షల కొత్త ఉద్యోగాలు వచ్చాయని మంత్రి పేర్కొన్నారు. పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ యోజన ద్వారా 2.4 లక్షల స్వయం సహాయక సంఘాలకు సాయం అందిందన్నారు. పంటకోతల తర్వాత నష్టాలను తగ్గించేందుకు కూడా వివిధ పథకాలను తెచ్చామన్నారు. వీటి వల్ల వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ లో ఉత్పాదకత, ఆదాయం పెరుగుతోందన్నారు. మోడ్రన్ స్టోరేజ్, సప్లై చైన్స్, ప్రాసెసింగ్, మార్కెటింగ్, బ్రాండింగ్ వంటి వాటిలో పబ్లిక్, ప్రైవేట్ పెట్టుబడులను మరింత ప్రోత్సహిస్తామని ప్రకటించారు. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్)తో 1,361 మండీలను అనుసంధానం చేశామని, వీటిద్వారా 1.8 కోట్ల మంది రైతులకు రూ. 3 లక్షల కోట్ల మేరకు వాణిజ్య లబ్ధి జరిగిందన్నారు.

నూనె గింజల ఉత్పత్తి పెరగాలె

నూనెగింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధత సాధించే దిశగా 2022లో ఆత్మనిర్భర్ ఆయిల్ సీడ్స్ అభియాన్‌ను ప్రారంభించినట్లు నిర్మల సీతారామన్ తెలిపారు. ఆవ, వేరుశనగ, సోయా, కుసుమ, పొద్దుతిరుగుడు వంటి నూనెగింజల ఉత్పత్తి పెంచేందుకు ప్రత్యేక స్ట్రాటజీని రూపొందిస్తామన్నారు. ఇందులో భాగంగా అధిక దిగుబడిని ఇచ్చే వంగడాలపై పరిశోధన, ఆధునిక వ్యవసాయ పద్ధతుల అమలు, మార్కెటింగ్, సేకరణ, వ్యాల్యూ యాడిషన్, పంటల బీమా వంటివి అమలు చేస్తామన్నారు. వివిధ పంటలకు నానో లిక్విడ్ యూరియా (డీఏపీ) వాడకం విజయవంతంగా జరిగినందున ఇకపై అన్ని అగ్రోక్లైమాటిక్ జోన్లలోని పంటలకు నానో యూరియా వాడకాన్ని విస్తరిస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు.

పాడి, మత్స్య రైతులకు ప్రోత్సాహం

ఫిషరీస్ కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. దీని వల్ల కొత్తగా ఉద్యోగాలు కూడా వస్తాయన్నారు. పీఎం మత్స్య సంపద స్కీంతో ఆక్వా కల్చర్ ఉత్పాదకతనూ పెంచుతామని చెప్పారు. సీ ఫుడ్ ఎగుమతులను రూ. లక్ష కోట్లకు పెంచాలన్న లక్ష్యాన్ని చేరుకునేలా ఈ స్కీంను అమలు చేస్తామన్నారు. ఇందులో భాగంగా 5 ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కులను ఏర్పాటు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. అలాగే పాడి రైతులకు మద్దతు కోసం ప్రభుత్వం ఒక సమగ్రమైన విధానాన్ని రూపొందించనుందని ఆర్థిక మంత్రి చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మోదీ ఆలోచనలకు రోడ్ మ్యాప్ ఈ బడ్జెట్



2024–25 మధ్యంతర బడ్జెట్ 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ ను నిర్మించాలనే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పానికి రోడ్‌మ్యాప్‌ను రూపొందించింది. భారత్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు గడిచిన పదేండ్లల్లో మోదీ ప్రభుత్వం సాధించిన మైలురాళ్లను బడ్జెట్ ప్రసంగం వెలుగులోకి తెచ్చింది. 'వికసిత్ భారత్ బడ్జెట్' దేశంలోని రైతుల అభివృద్ధికి కొత్త అవకాశాలను తెచ్చిపెట్టింది. మోదీ ఆలోచనలకు ఈ బడ్జెట్ రోడ్ మ్యాప్.- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

సబ్సిడీలు తగ్గినయ్

ఫుడ్, ఫర్టిలైజర్, పెట్రోలియం ఉత్పత్తులపై రాయితీలు కట్

న్యూఢిల్లీ: మధ్యంతర బడ్జెట్ లో ఫుడ్, ఫర్టిలైజర్ సబ్సిడీలకు నిధులు తగ్గాయి. 2023-24 బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి 8 శాతం తక్కువగా రూ. రూ. 3.69 లక్షల కోట్లను ఆర్థిక మంత్రి కేటాయించారు. ఇందులో ఫుడ్ సబ్సిడీ కింద రూ. 2,05,250 కోట్లను అలకేట్ చేశారు. అయితే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మార్చి 2024 నాటికి రివైజ్డ్ అంచనాల ప్రకారం రూ. 2,12,322 కోట్లు కేటాయించగా.. తాజా బడ్జెట్ లో ఇంతకంటే రూ. 7 వేల కోట్లు తక్కువగా కేటాయించారు. ఇక ఫర్టిలైజర్ సబ్సిడీ కింద గత బడ్జెట్ లో రివైజ్డ్ అంచనాల మేరకు రూ. 1.89 లక్షల కోట్ల మేరకు కేటాయించగా.. ఈసారి బడ్జెట్లో రూ. 1.64 లక్షల కోట్లను మాత్రమే అలకేట్ చేశారు. కాగా, కేంద్రం దేశవ్యాప్తంగా 80 కోట్ల మంది పేదలకు ఉచిత రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది. అలాగే రైతులకు ఎరువులపై భారీ మొత్తంలో సబ్సిడీని భరిస్తోంది. ఇక వంట గ్యాస్ సహా పెట్రోలియం ఉత్పత్తులపై సబ్సిడీకి గత బడ్జెట్ లో రూ. 12,240 కోట్లు కేటాయించగా.. ఈసారి రూ. 315 కోట్లు తక్కువగా రూ. 11,925 కోట్లు కేటాయించారు.



యూజీసీకి 61% కోత

- ఐఐఎంలకు వరుసగా రెండో ఏడాది కూడా తగ్గింపు
- స్కూల్ ఎడ్యుకేషన్ కు రికార్డు స్థాయిలో రూ.73 వేల కోట్లు కేటాయింపు



న్యూఢిల్లీ :

మధ్యంతర బడ్జెట్ కేటాయింపుల్లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కు భారీగా కోత పడింది. ఏకంగా 61 శాతం కోత విధించారు. యూజీసీ కేటాయింపుల్లో నిరుటి సవరించిన అంచనాలు రూ.6,409 కోట్ల నుంచి రూ.2500 కోట్లకు (61 శాతం కోత) తగ్గించారు. అలాగే ఐఐఎంలకు వరుసగా రెండో ఏడాది కూడా కోతలు పెట్టారు. నిరుటి సవరించిన అంచనాలు రూ.608.23 కోట్ల నుంచి రూ.300 కోట్లకు తగ్గించారు. బడ్జెట్ కేటాయింపులు కూడా రూ.331 కోట్ల (సవరించిన అంచనాలు) నుంచి రూ.212.21 కోట్లకు తగ్గించారు. ఇక ఐఐటీలకూ గ్రాంట్లు రూ.10,384.21 కోట్ల (సవరించిన అంచనాలు) నుంచి రూ.10,324.50 కోట్లకు తగ్గించారు. అయితే సెంట్రల్ యూనివర్సిటీలకు గ్రాంట్లను 28 శాతం పెంచారు. సెంట్రల్ వర్సిటీలకు బడ్జెట్ ను రూ.12000.08 కోట్ల (సవరించిన అంచనాలు) నుంచి రూ.15,472 కోట్లకు పెంచారు. అలాగే, స్కూల్ ఎడ్యుకేషన్ కు ఈసారి కేటాయింపులు రికార్డు స్థాయిలో పెరిగాయి. రూ.72,743.80 కోట్ల నుంచి రూ.73,008.10 కోట్లకు కేటాయింపులు చేశారు. కాగా హయ్యర్ ఎడ్యుకేషన్ కు ఏకంగా రూ.9600 కోట్లు తగ్గించారు. సవరించిన అంచనాలు రూ.57,244.48 కోట్ల నుంచి రూ.47,619.77 కోట్లకు తగ్గించారు. మధ్యంతర బడ్జెట్ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల మాట్లాడుతూ 2014 నుంచి కొత్తగా 7 ఐఐటీలు, 16 ట్రిపుల్ ఐటీలు, 7 ఐఐఎంలు, 15 ఎయిమ్స్ లు, 390 యూనివర్సిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే 3 వేల ఐటీఐలను నెలకొల్పామని చెప్పారు.

ద్రవ్యలోటు ఆందోళనకరం

మధ్యంతర బడ్జెట్‌పై ప్రతిపక్షాల అసంతృప్తి



న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ పై ప్రతిపక్షాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. పెరుగుతున్న ద్రవ్యలోటు ఆందోళన కలిగిస్తోందని కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ అన్నారు. నిర్మల మధ్యంతర బడ్జెట్ ప్రశేశపెడుతున్న సమయంలోనే మీడియాతో తివారీ మాట్లాడారు. ఈ ఏడాది రూ.18 లక్షల కోట్ల ఆర్థిక ద్రవ్యలోటు ఉన్నట్లు నిర్మల ప్రవేశపెట్టిన అంకెలే చెబుతున్నాయని పేర్కొన్నారు. ఈ సంఖ్య మరింత పెరుగుతుందని, ఇది ఆందోళన కలిగించే అంశమని ఆయన వ్యాఖ్యానించారు. బడ్జెట్ లో రాజకీయం తప్ప, సామాన్యుడికి ఉపయోగపడేది ఏమీ లేదని ఛత్తీస్ గఢ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ అన్నారు. జైపూర్ లో జరుగుతున్న సాహిత్య వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాన్ని పొగడడం తప్ప సామాన్యులను నిర్మల దృష్టిలో పెట్టుకోలేదని విమర్శించారు. రైతులు, యువతకు ఈ బడ్జెట్ తో సంబంధమే లేదని ఆయన ఫైర్ అయ్యారు. నిర్మల బడ్జెట్ పనికిమాలినదని సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ అన్నారు. అది ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని ఆయన ధ్వజమెత్తారు. బడ్జెట్ లో అభివృద్ధే కనిపించనపుడు అది ఉపయోగం లేని బడ్జెటే అవుతుందని అఖిలేష్ మండిపడ్డారు. లోక్ సభ ఎన్నికలు పూర్తయి కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు కేంద్ర ప్రభుత్వం వద్ద చాలినన్ని నిధులు ఉండేలా చూసుకోవడానికే ఈ బడ్జెట్ తయారు చేశారని కాంగ్రెస్ ఎంపీ కార్తి చిదంబరం ఎద్దేవా చేశారు. తమను తాము పొగుడుకోవడం, ప్రశంసించుకోవడం తప్ప సామాన్యులకు ఉపయోగపడేదీ ఏదీ బడ్జెట్ లో లేదని ఆయన విమర్శించారు. ఎట్టకేలకు దేశంలో ప్రజలు, మహిళలు, యువత, రైతులు ఉన్నట్లు కేంద్రం గుర్తించిందని శివసేన (ఉద్ధవ్ బాల్ ఠాక్రే వర్గం) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. మోదీ ప్రభుత్వానికి ఇది చివరి బడ్జెట్ అని, నిర్మల ఎంతో బరువైన హృదయంతో ఈ బడ్జెట్ ప్రవేశపెట్టారని ఆయన వ్యాఖ్యానించారు.